## మహేష్‌ కుమార్‌కు కృతజ్ఞతలు


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బొంతు దంపతులు

**కుషాయిగూడ:** టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం మాజీ మేయర్‌ బొంతు రాంమోహన్‌, కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

**అభినందనలు..**

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన గ్రేటర్‌ మాజీ మేయర్‌ బొంతు రాంమోహన్‌కు ఉప్పల్‌ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్‌ పావనీరెడ్డి, కాంగ్రెస్‌ నేతలు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గిరిబాబు, సాయినీతిష్‌, రాజేష్‌, ప్రకాశ్‌ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం


మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

**మల్కాజిగిరి:** కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని పార్టీ మైనార్టీ విభాగం సీనియర్‌ నాయకుడు సయ్యద్‌ యూసుఫ్‌ అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది డివిజన్లలో సుమారు 180 మంది మహిళలకు మైనార్టీ విభాగం నుంచి మంజూరైన కుట్టుమిషన్లను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద మహిళలకు కుట్టుమిషన్లతో జీవనోపాధి లభిస్తుందన్నారు. రాజీవ్‌ యువశక్తి ద్వారా కూడా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గౌస్‌, హమీద్‌, వినోద్‌గౌడ్‌, నయీమ్‌, సయ్యద్‌, మబ్బు, మైముదాబేగం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ



**అల్వాల్‌:** లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ మేడ్చల్‌ ఆధ్వర్యంలో అల్వాల్‌ విజయ గణపతి దేవాలయంలో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం బాటసారులకు అల్పాహారం అందజేశారు. ప్రతి పౌర్ణమి రోజున అల్పాహారం అందజేస్తామని లయన్స్‌ క్లబ్‌ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్‌ బాలసుధన్‌, శ్రీధర్‌రెడ్డి, సిమర్జిత్‌సింగ్‌, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌, సురేందర్‌రెడ్డి, డింపుల్‌ పాల్గొన్నారు.

## వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల జాగ్రత్త

**మౌలాలి:** వర్షాకాలంలో పారిశుద్ధ్య సిబ్బంది మరింత జాగ్రత్తగా ఉండాలని మౌలాలి కార్పొరేటర్‌ సునీత శేఖర్‌ యాదవ్‌ అన్నారు. డివిజన్‌లోని సంతోషిమా నగర్‌లో వర్షాకాలం కోసం ముందస్తు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు నాలాల పక్కన రాళ్లు, చెత్త కుప్పలు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తుగా ఇలాంటి చెత్త, మట్టి కుప్పలు తొలగించకపోతే అది మళ్లీ నాలాలో కలిసి పోతుందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్‌ ఇన్‌చార్జి శ్రీనివాస్‌, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లీ కూతుళ్ల అదృశ్యం


మహమ్మద్‌ మున్నీ(ఫైల్‌)


అలియా(ఫైల్‌)

**ఉప్పల్‌:** తల్లీ కూతుళ్లు అదృశ్యమైన ఘటన ఉప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్‌ వాసవినగర్‌ ప్రాంతానికి చెందిన షేక్‌బాబు(32) డెలివరీ బాయ్‌. ఈ నెల 7వ తేదీన షేక్‌బాబు భార్య మహమ్మద్‌ మున్నీ(28), తన రెండో కూతురు అలియా(5)తో కలిసి పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఐలాలో.. నిధుల గోల్‌మాల్‌

- చర్లపల్లి ఐలాలో కమిషనర్‌, కాంట్రాక్టర్‌ కుమ్మక్కై..
- అంచనాలు పెంచి దండుకునేందుకు రంగం సిద్ధం
- చర్లపల్లి ఐలా కమిషనర్‌పై టీజీఐఐసీ అధికారులకు ఫిర్యాదు
- నిధుల పెంపును వ్యతిరేకించామంటున్న ఐలా మేనేజింగ్‌ కమిటీ


చర్లపల్లి ఐలా ఆవరణలో చేపట్టిన సంపు నిర్మాణం

**కుషాయిగూడ:** చర్లపల్లి పారిశ్రామికవాడలో చేపట్టిన సంపు నిర్మాణంలో భారీగా నిధులు గోల్‌మాల్‌ అయ్యాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కమిషనర్‌, కాంట్రాక్టర్‌ కుమ్మక్కై పనుల అంచనాలను పెంచి అందినకాడికి దండుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఓ సామాజికవేత్త టీజీఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు పొక్కింది. కాగా నిధుల పెంపును చర్లపల్లి ఐలా మేనేజింగ్‌ కమిటీ వ్యతిరేకించినట్లు తెలిసింది.

### పనుల అంచనాను రూ.75 లక్షలకు పెంచి..

చర్లపల్లి పారిశ్రామికవాడలో 3 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి సంపు నిర్మాణానికి చర్లపల్లి ఐలా అధికారులు రూ.24 లక్షలకు టెండర్‌ కాల్‌ ఫర్‌ చేశారు. ఓ సంస్థ రూ.14 లక్షలు అతి తక్కువగా టెండర్‌ కోట్‌ చేసి సంపు నిర్మాణం పనులను దక్కించుకుంది. కొంత మేరా పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌ కొన్ని రోజులుగా పనులను నిలిపివేశారు. ఈ క్రమంలో ఎవరి అనుమతి లేకుండా కమిషనర్‌, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై సంపు నిర్మాణ వ్యయాన్ని రూ.75 లక్షలకు పెంచినట్లు ఆరోపిస్తూ.. టీజీఐఐసీ వైస్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్లకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరి అనుమతి లేకుండా ఏకపక్షంగా కమిషనర్‌ నిర్ణయం తీసుకొని రూ.లక్షలు కాజేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని ఆరోపించారు.

### తీవ్రంగా వ్యతిరేకించిన మేనేజింగ్‌ కమిటీ

అంచనా వ్యయాన్ని పెంచడంతో తిరిగి పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం సంపు నిర్మాణ పనులు ఫినిషింగ్‌ దశకు చేరుకోవడంతో ఎంబీ రికార్డు చేసి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేందుకు ఐలా కమిషనర్‌ రంగం సిద్ధం చేసి ఐలా మేనేజింగ్‌ కమిటీ అనుమతికి ఎంసీ మీటింగ్‌లో తీర్మానం పెట్టాడు. ఏకంగా రూ.50 లక్షల నిధులను రివైజ్‌ చేయడాన్ని మేనేజింగ్‌ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. దీంతో కమిషనర్‌ దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. రూ.24 లక్షలకు కాల్‌ ఫర్‌ చేసిన పనులను రూ.14 లక్షలకు కోట్‌ చేసేత్‌ ఏకంగా రూ.75 లక్షలకు పెంచుతూ నిర్మాణాన్ని రివైజ్‌ చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేగాకుండా పారిశ్రామికవాడలో కొనసాగుతున్న స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం కోసం వివిధ కంపెనీల నుంచి కోట్లలో సేకరిస్తున్న నిధుల లెక్కలు కూడా సక్రమంగా నిర్వహించకుండా కమిషనర్‌ అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పై అధికారుల ఆదేశాల మేరకే

పనుల అంచనాల పెంపుపై అధికారుల ఆదేశాల మేరకే చేశామన్నారు. ఇంజనీరింగ్‌, టెక్నికల్‌ విభాగాలు సంపు నిర్మాణ వ్యయాన్ని సవరిస్తూ చేసిన ప్రతిపాదనలతో అంచనా వ్యయాన్ని పెంచుతూ టెండర్‌ను రివైజ్‌ చేశామన్నారు.

– ప్రభాకర్‌, చర్లపల్లి ఐలా కమిషనర్‌

### అంచనా వ్యయాన్ని పెంచడాన్ని వ్యతిరేకించాం



సంపు నిర్మాణ అంచనా వ్యయాన్ని పెంచడాన్ని చర్లపల్లి ఐలా మేనేజింగ్‌ కమిటీ వ్యతిరేకించింది. గత నెల 30న జరిగిన ఎంసీ మీటింగ్‌లో కమిషనర్‌ పెట్టిన ప్రతిపాదనను తిరస్కరిస్తూ తీర్మానం చేశాం. కాంట్రాక్టర్‌ విశ్వసనీయతపై నిలదీశాం.

– రోషి రెడ్డి, ఐలా చైర్మన్‌

## దళితుల భూములను ల్యాండ్‌ పూలింగ్‌కు తీసుకోవాలి


హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత నేతలు

**బోడుప్పల్‌:** బోడుప్పల్‌లోని సర్వే నంబర్‌–63/2 నుంచి 63/25లో 336 ఎకరాల్లో ల్యాండ్‌ పూలింగ్‌ పనులు చేపట్టాలని కోరుతూ బుధవారం మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో దళితులు హెచ్‌ఎండీఏ కమిషనర్‌ సర్ఫరాజ్‌ అహ్మద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే దళిత రైతులకు ఎకరానికి 600 గజాల చొప్పున కేటాయించాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో ల్యాండ్‌ పూలింగ్‌ చేపట్టారని, కోర్టు కేసు వల్ల పెండింగ్‌ పడిందన్నారు. కేసును వెకెట్‌ చేయించి ల్యాండ్‌ పూలింగ్‌ పనులు చేపట్టాలన్నారు. అందుకు హెచ్‌ఎండీఏ కమిషనర్‌ సర్ఫరాజ్‌ అహ్మద్‌ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్‌ బోడుప్పల్‌ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, అంబేడ్కర్‌ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మీసాల కృష్ణ, కామగల్ల నర్సింహ, చిన్నింగల్ల కుమార్‌, ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు ఉప్పరి విజయ్‌ తదితరులున్నారు.

## పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలంటూ ధర్నా


ఉప్పల్‌ డిపో ఎదురుగా ధర్నా చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

**బోడుప్పల్‌:** పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ ఉప్పల్‌ శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్‌ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌ నగర కార్యదర్శి సంతోష్‌ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు బస్సు చార్జీలను పెంచిందన్నారు. బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి ఉపేందర్‌, మహేందర్‌, షోయబ్‌, విష్ణువర్ధన్‌, కౌశిక్‌, దత్తు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు మైసమ్మ వార్షికోత్సవం


బంగారు మైసమ్మ వార్షికోత్సవ వేడుకల్లో కార్పొరేటర్‌ తదితరులు

**రామంతాపూర్‌:** ఆర్టీసీ కాలనీలోని శ్రీబంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి 18వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, యజ్ఞ యాగాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మాట్లాడుతూ రాబోయే బోనాల పండుగకు డివిజన్‌ పరిధిలోని అమ్మవారి ఆలయాలకు ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రభుత్వ నిధులు రెట్టింపు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌, అధ్యక్షులు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్‌, ఉపాధ్యక్షులు పద్మయ్య, రవీంద్ర, భారతి ప్రధాన సలహాదారు పసుల ప్రభాకర్‌రెడ్డితో పాటు రాజీవ్‌గౌడ్‌, ప్రమోద్‌, సుజిత్‌, గౌరి శంకర్‌, నాసు సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**ఉప్పల్‌:** హబ్సిగూడ 11 కేవీ విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ గణేష్‌ తెలిపారు. హబ్సిగూడ వీధి నంబర్‌–8లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు గ్రీన్‌హిల్స్‌ కాలనీ, బృందావన్‌ కాలనీ, వీవీ నగర్‌, వసంత్‌ విహార్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. ఎన్‌జీఆర్‌ఐ సబ్‌స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు కాకతీయనగర్‌ వీధి నంబర్‌– 2, 3, విక్రంపురి, నందనవనం కాలనీ, స్టేడియం మెట్రో లేన్‌, వీధి నంబర్‌–8 తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

**సైనిక్‌పురి విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో..**

**కాప్రా:** సైనిక్‌పురి విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం పలు కాలనీలకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీనివాసనగర్‌, శ్రీరాంనగర్‌, గాంధీనగర్‌, ఆదిత్యనగర్‌, అరుల్‌కాలనీలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోనుంది. రుక్మిణీపురి ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాసనగర్‌, అరుల్‌కాలనీ, బృందావన్‌కాలనీ, ప్రశాంత్‌నగర్‌, నయాక్రాంతినగర్‌లో సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

**వినాయకనగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..**

**మల్కాజిగిరి:** వినాయకనగర్‌ సబ్‌స్టేషన్‌ 11 కేవీ దేవీనగర్‌ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృపా కాంప్లెక్స్‌, శ్రీకృష్ణనగర్‌, సీతారాంనగర్‌, సైనిక్‌నగర్‌, రాంబ్రహ్మనగర్‌, దేవీనగర్‌ ప్రాంతాల్లో, 11 కేవీ డైట్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్‌బీనగర్‌, వినాయకనగర్‌ బ్లాక్‌–2, దినకర్‌నగర్‌ పార్క్‌, నేరేడ్‌మెట్‌, న్యూవిద్యానగర్‌, కేశవ్‌నగర్‌, డైట్‌ కాలేజీ, దేవీనగర్‌, భగత్‌సింగ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ సుమన్‌ క్రిస్టినా తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ఉప్పల్‌:** ఉప్పల్‌ భగాయత్‌లో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌ భగాయత్‌ ఒలీవ్‌ హోటల్‌ సమీపంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి(40–45 సంవత్సరాలు)కి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఆరా తీసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## వృద్ధుడి ఆత్మహత్య

### భార్యకు వైద్యం చేయించలేకపోతున్నాననే మనస్థాపంతో..

**అల్వాల్‌:** భార్యకు వైద్యం చేయించలేకపోతున్నానని మనస్థాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిజన బస్తీలో నివసించే మంచాల సత్యనారాయణ(68), అమృతలక్ష్మీ భార్యభర్తలు, వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సత్యనారాయణ ఆర్టీసీలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందారు. వృద్ధాప్య సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు అధికమయ్యాయి. ఈ క్రమంలో భార్యకు వైద్యం చేయించడానికి డబ్బులు లేవన్న మనస్థాపంతో బుధవారం ఉదయం ఇంట్లో వెంటిలేటర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరుగురు సంతానం ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు వైద్యం అందించడం పట్ల ఇబ్బందులు ఏర్పడటంపై స్థానికులు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వరద ముంపు సమస్యను పరిష్కరిస్తాం

**మల్కాజిగిరి:** మల్కాజిగిరి డివిజన్‌లో ముంపు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. ఓల్డ్‌ నేరేడ్‌మెట్‌ డైట్‌ కాలేజీ వద్ద రూ.40 లక్షలతో చేపట్టిన వరదనీటి కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ వరద ముంపు నివారణకు కాలనీల్లో బాక్స్‌ డ్రైన్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇక్కడ వరదనీటి కాలువ నిర్మాణం వలన కింది ప్రాంతంలోని బస్తీలో ముంపు సమస్య తప్పుతుందన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్‌ విభాగం అధికారులకు సూచించామన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**మౌలాలి:** డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్‌ కాలనీలో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్‌ సునీత శేఖర్‌యాదవ్‌ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ సహకారంతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అధికారంలో ఉన్నామని కొంత మంది అధికార పార్టీ నాయకులు, ఇతర పార్టీ నాయకులు విర్రవీగుతున్నారని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు అభివృద్ధి పనులు ఎందుకు చేయలేకపోయారని ఆమె ప్రశ్నించారు. తాను అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణను అన్నపూర్ణగా మార్చిన కేసీఆర్‌

### ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


బీఆర్‌కే భవన్‌ వద్దకు భారీ ఎత్తున చేరిన ఉప్పల్‌ నియోజకవర్గం గులాబీ శ్రేణులు

**కాప్రా:** ఆకలి కేకల తెలంగాణను దేశానికే అన్నపూర్ణ రాష్ట్రంగా మార్చిన గొప్ప నాయకుడు కేసీఆర్‌ అని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కొనియాడారు. కాళేశ్వరం కమిషన్‌ విచారణకు హాజరైన కేసీఆర్‌కు మద్దతుగా ఉప్పల్‌ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీగా గులాబీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు గుక్కెడు నీళ్లు కూడా లేకుండా చేస్తే పట్టుబట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి బీడువారిన భూములను తడపాలని కేసీఆర్‌ పడిన తపన ఈ నీచరాజకీయాలు చేసేవాళ్లకు అర్థం కాదని మండిపడ్డారు. ఆత్మగౌరవంతో రైతులు తలెత్తుకునేలా చేసిన ఘనత కేసీఆర్‌దేన్నారు. వలస జిల్లాగా పేరు మారిన పాలమూరు జిల్లాకే తిరిగి వలసవచ్చేలా చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కరెంటు కోతలు, కాలే మోటార్లు, పేలే స్టాటర్లతో తల్లడిల్లిన తెలంగాణలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ ఇచ్చి రైతులు గుండెలపై చెయ్యి వేసుకుని కంటి నిండా నిద్రపోయే రోజులు తీసుకొచ్చింది కేసీఆరే అన్నారు. అలాంటి కేసీఆర్‌పై విచారణ పేరుతో కక్షసాధింపు, రాజకీయ వేధింపులే తప్ప మరొకటి లేదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న మాజీ మేయర్‌ అమర్‌సింగ్‌

**బోడుప్పల్‌:** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం మాజీ మేయర్‌ అమర్‌సింగ్‌ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. మొదటి దశలో ఇళ్లు రాని వారు నిరుత్సాహ పడొద్దని, రెండో విడతలో ఇస్తామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, నేతలు పప్పుల అంజిరెడ్డి, పాశం బుచ్చియాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎన్‌డీపీ పనులు పున:ప్రారంభం


పీర్జాదిగూడలో ఎస్‌ఎన్‌డీపీ పనులను పున: ప్రారంభోత్సవంలో మాజీ మేయర్‌ అమర్‌ సింగ్‌

**బోడుప్పల్‌:** గతంలో ఆగిపోయిన ఎస్‌ఎన్‌డీపీ పనులు పున: ప్రారంభమైనట్లు పీర్జాదిగూడ మాజీ మేయర్‌ అమర్‌ సింగ్‌ వెల్లడించారు. పీర్జాదిగూడలో బుధవారం రెండో దఫా ఎస్‌ఎన్‌డీపీ పనులు ప్రారంభం కాగా కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావుతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మేయర్‌ అమర్‌సింగ్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హయాంలో నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ చొరవతో మరలా నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రాధాన్యం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌

**అల్వాల్‌:** మచ్చబొల్లారం డివిజన్‌ రాయల్‌ ఎన్‌క్లేవ్‌లో రూ.49.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కాలనీలో ఇప్పటికే డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, కాలనీవాసులు ముందుగానే ప్రస్తావించడంతో ఈ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహరెడ్డి, చంద్రశేఖర్‌రావు, నాగిరెడ్డి, రాజు, అశోక్‌, రామలింగం, చైతన్య, స్వప్న, వీణ, శిరీష, భారతి, అనిత, గీత, మంజుల, అరుణ, పద్మ, మల్లేశ్వరి, శ్రీలత, ప్రవళిక, సునీత, శ్రీదేవి, అనుష, కాంగ్రెస్‌ నాయకులు సురేందర్‌రెడ్డి, నవీన్‌, లడ్డు, కొండల్‌రెడ్డి, స్వామి, సందీప్‌, విష్ణు, ఆనంద్‌, రమేష్‌, వెంకటేష్‌గౌడ్‌, రాము, సెల్వరాజు, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



# హబ్సిగూడలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్‌

**హబ్సిగూడ:** హబ్సిగూడ కార్పొరేటర్‌ కక్కిరేణి చేతన హరీష్‌ డివిజన్‌లోని రవీంద్రనగర్‌ కాలనీలో వర్షాకాలం ముందస్తు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కాలనీలో పేరుకుపోయిన చెత్త చెదారం, చెట్ల కొమ్మలను బుధవారం కార్మికులు తొలగించారు. చెత్తా చెదారాన్ని జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోలోనే వేయాలని రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశంలో వేయకూడదని స్థానికులకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా వెంకటరెడ్డి నగర్‌లో రూ.90 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇటీవల పరిశీలించినట్లు తెలిపారు. అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రవీంద్రనగర్‌ కాలనీ అధ్యక్షుడు నరసింహరెడ్డి, అన్నం రాఘవరెడ్డి, బీజేపీ నేత చింతకింది ప్రవీణ్‌, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## స్వరూప్‌నగర్‌లో రెండు ఇళ్లలో చోరీ

**ఉప్పల్‌:** ఉప్పల్‌ స్వరూప్‌నగర్‌లో అర్ధరాత్రి పూట దొంగలు రెండు ఇళ్లలోకి చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. ఈ ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌ స్వరూప్‌నగర్‌ ప్రాంతానికి చెందిన ప్రశాంత్‌ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ప్రశాంత్‌ ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం తీసి ఉంది. బీరువాలోని 18 తులాల బంగారం, 20 తులాల వెండి నగదు మాయమైంది. దీంతో బాధితుడు ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే కాలనీలోని మరో ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి ఓ సెల్‌ఫోన్‌ చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళల అభివృద్ధే కాంగ్రెస్‌ లక్ష్యం

**మల్లాపూర్‌:** మహిళల అభివృద్ధే కాంగ్రెస్‌ పార్టీ లక్ష్యమని గ్రేటర్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత నెమలి అనిల్‌కుమార్‌ అన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను మల్లాపూర్‌ డివిజన్‌కు చెందిన 20 మంది మైనార్టీ మహిళా లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి మహిళలు కుట్టు శిక్షణతో ఆర్థికంగా ఎదగాలనేది కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కుట్టుమిషన్లు రావడానికి సహకరించిన కాంగ్రెస్‌ పార్టీ ఉప్పల్‌ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.